# కొత్తపాట

-రసరాజు

అది-

నగరానికి దూరంగా విసిరేయబడ్డ చిన్న ఊరు.

దాని పేరు సంతపాలెం.

ఆ ఊరికి రెండే రెండు పొడవాటి వీధులు.

ఆ రెండూ లెక్కపెడితే వందిళ్లుంటాయి.

జనాభా - అయిదొందలు...

అందులో పది కుటుంబాల వరకు పాటలూ పద్యాలూ పాడుకొంటూ భిక్షాటన చేసేవాళ్లే.

వాళ్లందరికీ పురాణగాథలు బాగా తెలుసు. అక్షరం ముక్క రాకపోయినా ఆచితూచి అందంగా మాట్లాడటం వాళ్ల కళ. అదే వాళ్ల ఆస్తి.

ఆ పది కుటుంబాల వాళ్లకూ కొన్ని ఊళ్లున్నాయి. ఎవరి ఊళ్లల్లో వాళ్లే తిరగాలి. బయట భోజనం ససేమిరా ముట్టుకోరు. అది వాళ్ల నియమం.

దాసు- అందులో ఒకడు...

సీతాలు- అతని భార్య.

తెల్లారగానే టీ తాగేసి- వేడి అన్నం మూట కట్టుకొని ఇద్దరూ మెయిన్ రోడ్డెక్కుతారు. వాళ్లింటికా రోడ్డు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలో వుంటుంది.

రోడ్డెక్కాక ఎవరిదారి వాళ్లదే...

ఎవరి తంబురా వాళ్లదే... ఎవరి పాట వాళ్లదే...

దాసు ఒక పక్కకి వెళితే, సీతాలు మరో పక్కకెళుతుంది.

మళ్లీ సాయంత్రమే వాళ్లిద్దరూ ఇంటి దగ్గర కలుసుకొనేది.

✪✪✪

ఆ సాయంత్రం-

దాసు అయిదు గంటలకే ఇంటికొచ్చేశాడు.

సీతాలు ఆతరువాత వచ్చింది.

ఇద్దరికీ కలిపి ఆరోజు ఏభై రూపాయ లొచ్చాయి...

రోజు గడువాలంటే డెబ్భయి రూపాయ లయినా కనీసం వాళ్ల చేతుల్లో పడాలి.

రెండ్రోజుల్నుంచి ఇదే వరుస. సరిగా రావటం లేదు...

"ఎక్కడ చూసినా ఈ జనమే... వాళ్లు మాత్రం ఎంత మందికిస్తారు..." దాసు తమ రాబడి తగ్గినందుకు కారణాలు వెతుకుతూ అన్నాడు.

"నిజమే మావా... నే గుమ్మంలో కెళితే నా ముందిద్దరు... వెనకిద్దరు..." సీతాలు మొగుడికి వత్తాసు పలుకుతూ అంది.

"ఏం చేస్తాం..." అంటూ దాసు అక్కడే కూర్చుని చుట్ట వెలిగించాడు.

సీతాలు చెర్లోకెళ్లి మంచినీళ్లు తెచ్చింది.

ఆరయింది...

దాసు స్నానం చేసి దేవుడి దగ్గర అగరొత్తు వెలిగించాడు.

సీతాలు కొబ్బరి డొక్కలు పోగుచేసి పొయ్యి వెలిగించింది.

ఇంతలో ఎవరో "దాసూ..." అంటూ పిలి చారు.

దేవుడికి బెల్లం ముక్క "సందె నైవేద్యం" పెట్టి దాసు బయటకొచ్చాడు.

"ఎల్లుండి అమ్మోరు జాతర కదా... మీ ఇంటికా రాత్రి ఇద్దరు డప్పులు వాయించే వాళ్లొస్తారు... భోజనం పెట్టాలి..." అన్నాడు ఆ వచ్చిన వాళ్లలో ఒకడు.

దొడ్లో పొయ్యి వెలిగిస్తున్న సీతాలుకు ఒక్కసారిగా ఆనందం- ఆవేదన- రెండూ ఏకకాలంలో పెల్లుబికాయి.

ఆ అవకాశం ప్రతి ఇంటికీ అయిదేళ్లకోసారి కాని రాదు.

ఆ అవకాశమొచ్చిందంటే- అది అమ్మోరు దయే అని ఆ ఊరి వాళ్ల నమ్మకం.

అమ్మోరు సేవలో పాల్గొనే ఏ వ్యక్తికి ఇంత అన్నం పెట్టినా- అది అమ్మోరు ఆరగించినట్లే లెక్క.

ఆ ఊళ్ళో ఉన్నోళ్లూ లేనోళ్లూ అనే తారతమ్యం లేకుండా ఆ అవకాశాన్ని ప్రతి ఉగాదికీ అందరూ వినియోగించుకొంటారు. ఉగాదికే ఆ ఊళ్లో అమ్మవారి జాతర.

దాసు ఆ ఊరొచ్చి అయిదేళ్లయింది. ఇదే అతనికి మొదటి అవకాశం. అంతకు ముందెక్కడో పీచుపల్లిలో ఉండేవాడు. ఒకప్పుడు దాసు తాతగారిది సంతపల్లే. అదే అభిమానం వరల అతన్ని సంతపల్లి తీసుకొచ్చింది.

ఆ ఊరి అమ్మోరు గురించి దాసుకు బాగా తెలుసు.

ఆ తల్లి చల్లగా చూస్తే రాజ్యాలే ఏలొచ్చు అనేవాడు తన తాత.

భోజనాల మాట వినగానే దాసుకు-

సంబరమంతా గుండెల్లో కొలువు తీరినట్లనిపిం చింది.

అమ్మోరే రెండు రూపాల్లో ఇంటికొచ్చి భోంచేస్తుందేమో అనిపించింది.

మళ్లీ- అంతలోనే అతని మనసు గతుక్కు మంది.

"ఏవీ లేదు... ఇలాగే రోజుకి నలబయ్యో ఏబయ్యో వస్తే ఏం పెట్టేది?... అమ్మోరు అనుగ్రహిస్తుందా..." అదీ అతని బాధ.

"సర్లె... ఏం దొరికితే అది... అంతా అమ్మోరే చూసుకొంటుంది..." అదీ అతని నమ్మకం.

దాసు అలా తనకు తానే ధైర్యం చెప్పుకొని పొయ్యి

## జనారణ్యం

కాల చక్రంతో... మనిషి పరుగులు
తీస్తూనే వుంటాడు
ఎంతకూ చేరని గమ్యం కోసం
ఆరాట పడుతూనే వుంటాడు
అనుభూతుల్ని అంతరంగంలో సమాధి
చేసుకుని
అర్ధ వంతమైన జీవితాన్ని ఆలింగనం
చేసుకుంటాడు
ఇక్కడ మనిషికి గుండె వుండదు
ఉన్నా అందులో మనసు ఉండదు
ఇక్కడ మనిషికి మనసు ఉండదు
ఉన్నా అందులో మానవత్వం ఉండదు
ఇక్కడ ఉన్నదల్లా హిపోక్రసీ
చిరునవ్వుతో షేక్ హేండిచ్చి
చేయిచ్చిన వాడి మోచేయిని
నరికేయడం ఇక్కడ ఈజీ
ఆర్తిగా ఆలింగనం చేసుకుని
వెనుక నుండి వీపు మీద
పిడి బాకులు దింపడం ఇక్కడి పాలసీ
అందుకే నా మాట విని
ఇక్కడి నుండి వెళ్ళిపొండి
మీకు తెలీకుండా మీ వెనుకాల
తిరుగాడే నీలి నీడల నుండి
పారిపోండి.
ఈ కలుషిత జనారణ్యం నుండి
కాలుష్య రహిత కీకారణ్యంలోకి
వలస పోండి.

-పెరుమాండ్ల శ్రీదేవి

దగ్గరున్న సీతాలు దగ్గరికొచ్చాడు.

"విన్నాను మావా... అమ్మోరు తొలిసారిగా మనింటికి కూడా వస్తోంది. ఆనందంగానే వుంది... కాని మావా..." సీతాలు మధ్యలో ఆగిపోయింది.

అది దాసు గ్రహించాడు.

"పోన్లేవే... ఆ దప్పులోళ్లకి ఆ తల్లి ఏమిస్తే అదే పెడదాం... దానికి దిగులెందుకు..." భార్యకు మరింత దగ్గిరగా జరిగి దాసు ఊరట పలికాడు.

"ఒక మాట మావా..." ఏదో ఆలోచన సీతాలును తట్టి లేపింది- ఆ నిమిషంలో.

"ఏవిటే..." దాసు ఆసక్తిగా చెవి ఒగ్గాడు.

"ఏం లేదు మావా... ఈరోజు నుంచి జాతరయ్యే దాకా మనం కాస్త కడుపు కట్టుకోవాలి... ఎందుకంటావా... రేపెంతొస్తుందో తెలీదు కదా... ఎల్లుండే ఉగాది... అమ్మోరు జాతర... ఆరోజు ఊళ్లో వాళ్లెవరం బయటకు పోనేపోం... అందుకని... ఈ రేత్రికి మనం వండుకోవటం మానేద్దాం... పొద్దున వండింది ఇంకా కాస్తో కూస్తో వుంది. అదే సరిపెట్టుకొని ఇన్ని నీళ్లు తాగేద్దాం... ఏవంటావు..."

"అంతే... అలాగే చేద్దాం... ఇవ్వేల్టిది రేపటిది కర్చు సేయమోకు... దప్పులోళ్లకి కడుపు నిండా మంచి భోజనం పెట్టాలి' అంటూ ఆమె మాటకు ఊతమిస్తూ దాసు పైకి లేచాడు. ఆ రాత్రి ఇద్దరికీ నిద్రే పట్టలేదు.

"ఇవ్వేళ ఏబై... మరి రేపెంతో... అదీ ఇదీ కలిపితే ఎల్లుండి వాళ్ల భోజనానికి సరిపోతుందో లేదో..." ఇదే వాళ్ల ఆలోచన. బాగా రాత్రిపద్దాక దాసుకు ఆకలేసింది. కుండలో మంచినీళ్లు కడుపు నిండా తాగేసి మళ్లీ నులక మంచం మీదకొచ్చి నడుం వాల్చాడు. సీతాలుకూ ఆకలేసింది. అయితే ఆమె అమ్మోరును తలుచుకుంటూ ఆ రాత్రంగా గడిపేసింది.

✪✪✪

ఉగాది-

అమ్మోరు జాతర హడావిడి ఆరోజు ప్రతి ఇంట్లోనూ కనిపిస్తోంది.

ఉన్నోళ్లు- మేకలూ గొర్రెలూ సిద్ధం చేసి కొన్నారు.

మధ్య తరగతి కుటుంబాల వాళ్లు కోళ్లతోటే సరిపెట్టుకోవాలనుకున్నారు.

ఆ పది కుటుంబాల వాళ్లు సైతం సంవత్సరానికోసారి కదా అని వాళ్లూ కోళ్లు కొనుక్కొన్నారు.

అందులో- దాసు- వాళ్లందరి కంటె ముందున్నాడు.

అరకోడి కొన్నాడు...

మొన్న ఏబై అలాగే వున్నాయి.

నిన్న అరవైలో- పదే ఖర్చయ్యాయి.

ఈరోజు ఉదయం కూడ తప్పనిసరి పరిస్థితుల్లో తనొక్కడే తంబురా తీసుకొని అలా వెళ్లొచ్చాడు.

అదృష్టం బాగుండి అమ్మోరు దయ వల్ల ఉగాది పూడ కూడ ఏబై వచ్చాయి. మరో ఏబై ఊళ్లోనే ఇద్దరి దగ్గర అప్పుచేశాడు. అందరూ జాతర మరుసటి రోజు మసాలా విందు చేసికోవటానికి సిద్ధపడితే, దాసు మాత్రం జాతర రోజు రాత్రే కోడికూర వండించాలనుకొన్నాడు.

తెల్లారితే ఆ డప్పులోళ్లుందరు...

వాళ్లకి ఈ రాత్రే కడుపు నిండా భోజనం పెట్టాలి...

సీతాలు గారెలు కూడా వండింది...

ఎక్కణ్ణుంచో గడ్డ పెరుగు తీసుకొచ్చింది...

చెర్లోంచి రెండు పెద్ద తామరాకులు తెమ్మని మావకు పురమాయించింది.

రాత్రి–

ఎనిమిది గంటల వేళలో– ఆ డప్పులోళ్లిద్దరూ భోజనానికొచ్చారు.

పక్కనే దాసు కూర్చున్నాడు.

సీతాలు అన్నీ ఒకటికి రెండుసార్లు ఆ తామరాకుల్లో కొసరి కొసరి వడ్డించింది.

సీతాలు– కోడి కూర వండటంలో దిట్ట.

ఆ వాసన ముక్కుకి తగులుతున్నప్పుడల్లా– దాసు తన పెళ్లాన్ని మనసులో మెచ్చుకొంటూనే వున్నాడు.

గారెలు కరకరలాడుతుంటే– ఆ పనితనానికి అభినందిస్తూ సీతాలువేపు చూడకుండా ఉండలేకపోయాడు.

ఆఖరికి గడ్డ పెరుగు నుండి సైతం కమ్మని వాసన తగిలేసరికి "వారెవ్వా..." అనుకొన్నాడు.

డప్పులోళ్లిద్దరూ నుష్ఠుగా భోంచేసి– భుక్తాయాసంతో పైకి లేచారు.

పైకి లేస్తూ "బాగా పెట్టావు తల్లీ..." అంటూ సీతమ్మను పదేపదే మెచ్చుకొన్నారు.

ఆ ఇద్దరూ వెళ్లిపోయాక– ఎవరూ చూడ కుండా సీతాలు బుగ్గపై దాసు ఓ తియ్యటి ముద్దు పెట్టి తన ఆనందాన్ని వ్యక్తపరిచాడు.

డప్పులోళ్లు తినగా మిగిలింది పెద్దగా ఏవీ లేదు...

ఉన్న దానితోటే ఆ ఇద్దరూ తృప్తిపడ్డారు.

ఒకరి ముఖం ఒకరు చూసుకొని ఆనంద పడ్డారు.

✪✪✪

జాతర అయేసరికి రాత్రి రెండు దాటి పోయింది.

డప్పులోళ్లతో పాటు మరికొంత మంది దాసు ఇంటి పక్కనే వున్న పెద్ద అరుగు మీదకొచ్చి పడుకొన్నారు.

దాసు, సీతాలు అప్పటికే ఇంటికొచ్చేశారు.

"డప్పు బలే మోగిందిరా యియ్యేల..." అక్కడ పడుకొన్న వాళ్లలో ఒకడన్నాడు.

"ఆ అమ్మ అలా పెట్టిందిరా బోజనం... అందుకే సెయ్యి అలా పూనేసిందనుకో..." అన్నాడు ఆ డప్పు వాయించిన మనిషి.

"కోడి కూరంటే అదెహే... పీకలదాకా తినేవరకు ఆళ్లు వదిలి పెట్టలేదనుకో..." మరొక డప్పు వాద్యగాడు తన అనుభూతిని వెళ్లగక్కేడు.

ఆ మాటల్ని ఇవతల ఇంట్లోంచి సీతాలు, దాసు విన్నారు.

ఈసారి సీతాలే దాసు బుగ్గపై మరిచిపోలేని ముద్దిచ్చింది.

తెల్లారింది...

ఆ పెద్ద అరుగుమీద పడుకొన్న వాళ్లందరూ వెళ్లిపోయారు.

దాసు ఆరు గంటలకే లేచి దేవుడి ముందు అగరొత్తు వెలిగించి బెల్లం ముక్క "ఉదయ నైవేద్యం" పెట్టాడు.

గోడ మూలగా వున్న తంబురా తీసికొన్నాడు.

అతనిలోంచి ఏదో కొత్త పాట దూసుకొచ్చింది.

అప్పుడప్పుడు మనసు పుట్టినప్పుడల్లా దాసు లోంచి కొత్త పాటలు బయట పడుతుంటాయి. అవి అతనే అల్లుకొంటాడు.

"అదేవిటి మావా... ఇంటి దగ్గర పొద్దుటే తంబురా పట్టుకొన్నావ్..." సీతాలు చిక్కని టీ అందిస్తూ అడిగింది.

టీ అందుకొంటూ భార్యకేసి తృప్తిగా చూశాడు దాసు.

"ఏటి మావా... రేతిరి నిద్రలేకపోయినా కళ్లల్లో ఎక్కడా అలసట కనపట్టం లేదు... వూంచి సంతోసంగా వున్నావు..." అంది సీతాలు.

"అది కాదే... ఓ కొత్త అనుబవం... దాని వెంటే కొత్త పాట... నాకైతే బలే సంతోసంగా వుందనుకో..."

"ఏ అనుబవం మావా..."

"ఎప్పుడూ ఎవరో ఇచ్చింది తెచ్చుకొని మన బతుకు మనం గడుపుకొంటున్నాం... వాళ్లు పెట్టే వాళ్లు... మనం తినేవాళ్లం... కాని... ఇయ్యాల అలా కాదే... మనమే పెట్టేవాళ్లమయాం... మరెవరో తినేవాళ్లయారు... ఒకళ్లకి పెట్టటంలో వున్న ఆనందం మా గొప్పగా వుందే... ఇది నీకు మాత్రం సంతోసంగా లేదూ... అందుకే ఈ కొత్త పాట..." అంటూ దాసు టీ గ్లాసు నోటి దగ్గర పెట్టుకొన్నాడు. ∎